# విద్యార్థుల ఆకలికేకలు

- ఎమ్మెల్యే వస్తారని ఎదురుచూపు
- మధ్యాహ్న భోజన సమయమైనా స్టూడెంట్స్‌ను వదలని పాఠశాల సిబ్బంది
- కాంగ్రెస్ నేతలు ఓకే అన్నాకే భోజనం వడ్డింపు
- వరుసగా మూడోరోజూ వార్తల్లో మాగనూరు పాఠశాల



శుక్రవారం మధ్యాహ్నం 12:45 గంటలైనా తరగతి గదుల్లోనే ఉన్న విద్యార్థులు

మక్తల్, నవంబర్ 22 : నారాయణపేట జిల్లా మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మూడ్రోజులుగా ఏదో ఒక సమస్యతో వార్తల్లోకెక్కుతున్నది. బుధవారం ఫుడ్ పాయిజన్ కావడంతో దాదాపు 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా గురువారం కలెక్టర్‌తో పాటు అధికారులు పాఠశాలకు వచ్చి నాణ్యమైన భోజనం అందించాలని సూచించినా పురుగుల అన్నం వడ్డించారు. తాజాగా శుక్రవారం పాఠశాలకు ఎమ్మెల్యే వస్తున్నారంటూ విద్యార్థులకు పస్తులు ఉంచడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు ఇలా.. మాగనూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం అధికారుల ఎదుటే సాంఘిక సంక్షేమ వసతి గృహం వంట సిబ్బంది మధ్యాహ్న భోజనాన్ని వండారు. అంతా సిద్ధం చేసినప్పటికీ మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి వస్తున్నారు.. అప్పటివరకు విద్యార్థులకు భోజనం పెట్టొద్దని కాంగ్రెస్ నాయకులు హడావిడి చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం పెట్టాల్సి ఉండగా.. ఇంకా రాలేదు.. దగ్గర్లోనే ఉన్నారు.. వస్తున్నారు.. అంటూ తమ నేత మెప్పు కోసం తాపత్రయపడ్డారు. విద్యార్థులను వదలకుండా తరగతి గదుల్లోనే ఉంచడంతో వారు ఆకలితో అలమటించారు. ఒంటిగంట సమయంలో ఎమ్మెల్యే పాఠశాలకు చేరుకొన్నారు. ఆఫీస్ రూంలో ఉన్న అదనపు కలెక్టర్ వెంటనే బయట కొచ్చి ఎమ్మెల్యేతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు సమయానికి భోజనం పెట్టారా? లేదా? అని కనీసం పరిశీలించలేదు. విద్యార్థులకు సమయానికి అన్నం పెట్టాల్సిందిపోయి ఎమ్మెల్యే మెప్పుకోసం కాంగ్రెస్ నాయకులు పాకులాడటం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## మాగనూరు విద్యార్థులకు ఇంటి భోజనమే

మక్తల్/ఊట్కూరు, నవంబర్ 22 : మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించడం, అన్నంలో పురుగుల రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఇండ్ల నుంచే భోజనం పంపిస్తున్నారు. శుక్రవారం చాలా మంది పిల్లలు ఇంటి భోజనమే తిన్నారు.



మాగనూరు పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చిన భోజనాన్ని తింటున్న విద్యార్థులు

**ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తేయాలి**

ఫుడ్‌పాయిజన్ నేపథ్యంలో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో తపస్ ఆధ్వర్యంలో కృష్ణ, మక్తల్, ఊట్కూరులో ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన చేపట్టారు.



భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో కూరను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు



సూర్యాపేటలో మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## మొన్న సస్పెన్షన్.. నిన్న పోస్టింగ్

- నారాయణపేట డీఈవోకు మళ్లీ పోస్టింగ్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఫుడ్‌పాయిజన్ ఘటనలో సస్పెండైన నారాయణపేట డీఈవో మహ్మద్ అబ్దుల్ ఘనీకి ప్రభుత్వం తిరిగి పోస్టింగ్ ఇచ్చింది. ఆయనకు వనపర్తి జిల్లా డీఈవోగా అదనపు బాధ్యతలప్పగించింది. ఫుడ్‌పాయిజన్ ఘటనపై సీరియస్ అయిన ప్రభుత్వం అబ్దుల్ ఘనీని సస్పెండ్ చేసింది. గురువారం సస్పెండ్ చేయగా, శుక్రవారం వనపర్తి జిల్లా డీఈవోగా అదనపు బాధ్యతప్పగించింది. మరో విశేషమేమిటంటే ఆయనకు జోగులాంబ గద్వాల జిల్లా డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలి

- ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌ను సందర్శించిన యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్/సూర్యాపేట అర్బన్, నవంబర్ 22 : విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలని, లేకపోతే ఏజెన్సీ, హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తారకరామ నగర్‌లో గల ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అన్నం దొడ్డుగా ఉండడం, కూరలు సరిగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్-2ను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సందర్శించారు. భోజనశాలకు వెళ్లి వంట స్టాకు వివరాలు పరిశీలించారు.

## 20 మంది విద్యార్థులకు అస్వస్థత

- కరీంనగర్ జిల్లా బూరుగుపల్లి పాఠశాలలో ఘటన

గంగాధర, నవంబర్ 22 : కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తిన్న 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం భోజనం చేసిన తర్వాత ముగ్గురు కడుపునొప్పితో వాంతులు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నట్టు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు.









Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.